సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



వింత ఆచారం..

8లో

జిల్లాలో కనీవినీ ఎరుగని వింత ఆచారంతో నూకతాత పండగను గురువారం మత్స్యకారులు అత్యంత ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



శూలాల మహోత్సవం

కశింకోటలో బుధవారం రాత్రి సాంబశివుని శూలాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. 8లో



శివరాత్రి ఆదాయం రూ.కోటి

మహా శివరాత్రి పురస్కరించుకుని వివిధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా ఆర్టీసీకి రూ.కోటి వరకు ఆదాయం. 8లో

టీచర్ల పోలింగ్ ప్రశాంతం

- ఉదయం 8 గంటల నుంచే పోలింగ్ ప్రారంభం
- జిల్లాలో 96.18 శాతం నమోదు
- అత్యధికంగా చీడికాడ, రోలుగుంట, ఎస్.రాయవరం, మాకవరపాలెంలో 100 శాతం, అత్యల్పంగా యలమంచిలిలో 81 శాతం
- పీఆర్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ
- పోలింగ్ ప్రక్రియను కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించిన కలెక్టర్ విజయకృష్ణన్



అనకాపల్లి ఉడ్‌పేట పోలింగ్ కేంద్రంలో ఓటెయ్యడానికి క్యూలో ఉన్న ఉపాధ్యాయులు



కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం నుంచి పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

సాక్షి, అనకాపల్లి :

ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 96.18 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా చీడికాడ, మాకవరపాలెం, రోలుగుంట, ఎస్.రాయవరం పోలింగ్ కేంద్రాలో 100 శాతం, మునగపాక పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 91 శాతం నమోదైంది. జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,885 ఓటర్లకు గాను..2775 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 1057 మంది మహిళా ఓటర్లు, 1718 ఓటర్లు పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్ ఇలా...

ఉదయం 8 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల వరకూ 71.20 శాతం నమోదైంది. మధ్యాహ్నం 2 గంటల నాటికి 86 శాతం నమోదైంది. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం 4 గంటలకు వరకూ పోలింగ్ జరిగింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, డీఆర్వో సత్యనారాయణ పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కశింకోట బజార్‌వీధిలో ఉన్న 104వ పోలింగ్ కేంద్రాన్ని, అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. నర్సీపట్నం ప్రభుత్వ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకుడు ఎం.ఎం నాయక్ పరిశీలించారు. ఇప్పటికే జిల్లాలో 24 కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్స్‌లు జీవీఎంసీ మెయిన్ హైస్కూల్‌కు చేరాయి. ఇక్కడ నుంచి గురువారం రాత్రికి విశాఖలో గల ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రూంలకు చేరుకుంటాయి.

ఓటుకు రూ.2 వేలు..!

టీచర్ల ఎన్నికల్లోనూ ప్రలోభాలు విస్తృతంగా జరిగాయి. పోలింగ్ ముందు రోజు రాత్రి నుంచి ఓటుకు రూ.1500, రూ.2 వేలు చొప్పున పంచి ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. కూటమి పార్టీల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు నేరుగా వారి అనుచరుల ద్వారా డబ్బులు పంచి ప్రలోభాలకు గురిచేసినట్లు సమచారం. ఏపీటీఎఫ్ అభ్యర్థి తరుపున ఒక్కో ఓటుకు రూ.2 వేల వరకూ ఇచ్చి ప్రలోభాలకు గురి చేసినట్టు సమాచారం.

ఆ ముగ్గురు మధ్యే తీవ్ర పోటీ..

గురువుల ప్రథమ ప్రాధాన్యం ఎవరికిచ్చారనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 10 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ఆ ముగ్గురు మధ్య తీవ్ర పోటీ నెలకొంది. పీఆర్‌టీ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు, యూటీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. పోలింగ్ సమయంలో స్లిప్‌ల పంపిణీ నుంచి ఓటర్లను తమవైపునకు తిప్పుకునేందుకు ముగ్గురూ ముగ్గురే అన్నట్లుగా ఎందులోనూ తగ్గేదేలే అన్నట్లుగా స్పష్టమైంది. ఇక సత్తలూరి శ్రీరంగపద్మావతి, పెదపెంకి శివ ప్రసాద్, సుంకరి శ్రీనివాసరావు, పోతల దుర్గారావు, కోసూరి రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ..

అనకాపల్లి : ప్రశాంతమైన వాతావరణంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరిగాయని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. స్థానిక జీవీఎంసీ ఉడ్‌పేట పోలింగ్ బూత్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఓటు ఉన్న ఉపాధ్యాయులను మాత్రమే పోలింగ్ బూత్‌లోనికి అనుమతించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రంలో పోలీస్ భద్రత విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 100 మీటర్ల దూరంలో ఎటువంటి వాహనాలు నిలపకుండా, పోలింగ్ కేంద్రాలకు ఓటు కలిగిన ఉపాధ్యాయులను మాత్రమే అనుమతించడం జరిగిందని, మిగిలిన ఉపాధ్యాయులను 100 మీటర్లు దూరంలో ఉంచడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నట్టు ఆయన చెప్పారు. ఈయన వెంట పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉడ్‌పేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా



కోటవురట్లలో ఓటు హక్కు వినియోగించుకున్న డిప్యూటీ డీఈవో అప్పారావు, ఉపాధ్యాయులు



నర్సీపట్నంలో ఓటేసిన తర్వాత సిరా గుర్తు చూపుతున్న ఉపాధ్యాయినులు

కూటమి నేతల అత్యుత్సాహం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల సమీపంలో 200 మీటర్ల లోపే స్లిప్‌లు పంపిణీ చేశారు. సాధారణ ఎన్నికలను తలపించేలా పోలింగ్ కేంద్రం కూటమి నేతలు టెంట్‌లు వేసుకుని టీచర్ల కన్నా వీరి హడావుడే ఎక్కువగా కనిపించింది. నర్సీపట్నం ప్రభుత్వ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుమారుడు రాజేష్, మరికొంతమంది టీడీపీ నాయకులు ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు ఓటేయాలని బహిరంగంగా ప్రలోభాలకు గురిచేశారు. అనకాపల్లి టౌన్‌లో గల ఉడ్‌పేట జీవీఎంసీ హైస్కూల్‌లో అయితే ఓటేసే వరకూ కూడా ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సమయంలోనూ టీచర్ల వెంటే పోలింగ్ కేంద్రం వరకూ కూడా వెళ్లి ప్రలోభపరచడం చేశారు. చోడవరంలో రఘువర్మకు ఓటేయాలని కూటమి నేతలు మొబైల్ స్టేటస్‌లు కూడా పెట్టుకుని ప్రచారం చేశారు.



అనకాపల్లి ఉడ్‌పేటలో జీవీఎంసీ స్కూల్ లో గల పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్‌ను ప్రలోభాలకు గురిచేస్తున్న ఏపీటీఎఫ్ అభ్యర్థి వర్గీయులు





బాలెట్ బాక్స్‌లను అనకాపల్లిలోని జీవీఎంసీ మెయిన్ హైస్కూల్ వద్దకు తీసుకొస్తున్న పోలింగ్ సిబ్బంది

4 మండలాల్లో 100 శాతం పోలింగ్

చీడికాడ, రోలుగుంట, మాకవరపాలెం, ఎస్.రాయవరం మండలాల్లో 100 శాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో పోలింగ్ శాతాలు ఇలా ఉన్నాయి.

	శాతం
కశింకోట	98.81
సబ్బవరం	98.94
నక్కపల్లి	98.08
రావికమతం	98.08
దేవరాపల్లి	98.41
అచ్యుతాపురం	97
బుచ్చెయ్యపేట	97
నాతవరం	97
వి.మాడుగుల	96.36
చోడవరం	96.73
కోటవురట్ల	96.30
రాంబిల్లి	96.15
పరవాడ	95.24
అనకాపల్లి	95.36
పాయకరావుపేట	95.29
నర్సీపట్నం	95.20
కె.కోటపాడు	95.33
గొలుగొండ	95.12
మునగపాక	91.11
యలమంచిలి	93.3

ఓటేసి వచ్చి... కుప్పకూలి...



వెంకట రామారావు

అనకాపల్లి :

టీచర్స్ ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకొని స్థానిక గాంధీనగరం చెందిన వరహా గిరి వెంకటరామారావు (54) ఇంట్లో సోఫాలో కుప్పకూలి గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కశింకోట మండలం కొత్తపల్లి బుచ్చియ్యపేట హైస్కూల్‌కు చెందిన రామారావు లెక్కల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టణంలో ఉడ్‌పేట ఎలిమెంటరీ పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ఇంటికి వెళ్లి సోఫాలో కూర్చున్న తర్వాత ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

న్యూస్‌రీల్

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు



నారాయణ స్కూల్ యాజమాన్యానికి నోటీసు ఇస్తున్న విద్యాశాఖ సిబ్బంది

నర్సీపట్నం : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు కలెక్టర్ విజయ్‌కృష్ణన్ సెలవు ప్రకటించారు. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ నర్సీపట్నం టౌన్‌లో నారాయణ, భాష్యం పాఠశాలల నిర్వాహకులు యథావిధంగా తరగతులు నిర్వహించారు. పాఠశాలల నిర్వహణ వల్ల ఓటు వేసేందుకు ఉపాధ్యాయులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఆయా టీచర్స్ యూనియన్ల వారు విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోకుండా, పాఠశాలలు తెరిచిన యాజమాన్యాలకు విద్యాశాఖ సిబ్బంది నోటీసులు జారీ చేశారు.

14న ఉత్తరాంధ్ర పాడిపశువుల పాలపోటీలు

చీడికాడ : పశుసంవర్ధకశాఖ , బోఫైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే నెల 14 న ఉత్తరాంధ్ర పాడి పశువుల పాల పోటీలు నిర్వహిస్తున్నట్టు పాడేరు డివిజన్ పశుసంవర్ధక శాఖ సంచాలకుడు సి.హెచ్. నర్సింహులు పేర్కొన్నారు. మండలంలో కొత్తపల్లి, అడవిల అగ్రహారం, వింటిపాలెంలో పర్యటించారు. అధిక దిగుబడినిచ్చే పశువులను గుర్తించి, పాడి రైతులు పాల పోటీల్లో పాల్గోవాలని సూచించారు. విజయనగరం జిల్లా తోటపాలెంలో ఈ పోటీలు నిర్వహిస్తామని, పాడి రైతులు తమ వద్ద వున్న రోజుకు 20 లీటర్లు పాలిచ్చే హెచ్‌యఫ్ ఆవులు, రోజుకు 16 లీటర్లు పాలు ఇచ్చే జెర్సీ ఆవు, రెండు లీటర్లు పాలు ఇచ్చే ఒంగోలు, 8 లీటర్లు పాలిచ్చే గేదెలును ఈ పోటీలకు తీసుకుని రావచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఏరియా పశువైద్య సహాయ సంచాలకుడు చిట్టినాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


3న బ్యాంక్ ఉద్యోగుల ధర్నా

అనకాపల్లి : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో మార్చి 3న బ్యాంకుల వద్ద ధర్నా చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైనందున మార్చి 24, 25న దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు సమ్మె చేస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ జిల్లా ప్రతినిధి కాండ్రేగుల హరికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

2న జూలో పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో మార్చి 2న విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. పోటీల్లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు సీతాకోక చిలుకలు, పక్షులు, తేనెటీగలు ఎందుకు ముఖ్యమైనవి అనే అంశంపైన, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు వన్యప్రాణులను రక్షించడంలో సాంకేతికత పాత్ర, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులు వన్యప్రాణి సంరక్షణ ఫైనాన్స్-స్థిరమైన భవిష్యత్‌కు కీలకం అనే అంశాలపై పోస్టర్లు ఇంటిలోనే సిద్ధం చేసుకోవాలన్నారు. వాటిని పోటీలో ప్రెజెంట్ చేయాలని పేర్కొన్నారు.

ఓటరు పేరు... రెండుసార్లు నమోదు



ఓటర్ల జాబితాలో రెండోసారి నమోదైన ఆచంట నాగేశ్వరరావు పేరు

కశింకోట: కశింకోటలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి స్థానం ఓటర్ల జాబితాలో తప్పు చోటు చేసుకుంది. ఒక ఓటరు పేరు వరుసగా రెండు సార్లు నమోదైంది. కశింకోటలోని అగ్రహారం ప్రాంతానికి చెందిన ఆచంట నాగేశ్వరరావు పేరు ఓటర్ల జాబితాలో 24, 25 క్రమ సంఖ్యల్లో నమోదు అయింది. ముందు పేజి చివరిలో ఒకే చిరునామాతో ఉన్న పేరు, తర్వాత పేజీ మొదటిలోను రెండోసారి తప్పుగా నమోదైంది. దీంతో ఇక్కడ మొత్తం 83 మంది ఓటర్లుండగా 84 మందిగా జాబితాలో నమోదు అయింది. ఈ విషయాన్ని ముందుగా గుర్తించిన అధికారులు దీన్ని వాస్తవమైన 83 మంది ఓటర్లకు పరిమితం చేసి పోలింగ్ నిర్వహించామని ఇక్కడి ఎన్నికల పోలింగ్ అధికారి తెలిపారు. పోలింగ్ శత శాతం పూర్తి అయిందన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- మార్చి 1 నుంచి 20 వరకు 34 కేంద్రాల్లో పరీక్షలు
- హాజరు కానున్న 26161 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాల నిఘాలో నిర్వహణ
- కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధం





యలమంచిలి రూరల్: ఇంటర్ పబ్లిక్ పరీక్షల కోసం అధికారులు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం, 8.30 గంటల నుంచి అనుమతిస్తారు. **9 గంటల తర్వాత నిమిషం లేటైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి బి. సుజాత సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సెంటర్లలో ఫర్నిచర్, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. పరీక్షల్లో మాస్‌కాపీయింగ్, ఇతర అవకతవకలకు చెక్ పెట్టేందుకు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి తాడేపల్లిలోని ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయం, జిల్లా ఇంటర్ బోర్డు కార్యాలయాలతో అనుసంధానంగా పనిచేయనున్నాయి. ఆ కార్యాలయాల నుంచి పరీక్ష కేంద్రాల్లో ఏమి జరుగుతుందో వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద** ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా 144 సెక్షన్ విధించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్తు అంతరాయం లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే హెల్ప్‌డెస్క్ 9491334395, 08924220225 నంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

34 కేంద్రాలు ఏర్పాటు

ఇంటర్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 4 సాంఘిక సంక్షేమ, 16 ప్రైవేటు జూనియర్ కళాశాలలున్నాయి. మొత్తం 26,161 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో జనరల్ విద్యార్థులు 21276 మంది, ఒకేషనల్ విద్యార్థులు 4885 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 34 మంది చీఫ్ **సూపరింటెండెంట్లు(సీఎస్), 34 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు (డీవో), 2 సిట్టింగ్ స్క్వాడ్, 2 ఫ్లయింగ్‌స్క్వాడ్ బందాలను ఏర్పాటు చేశారు. వీరితో పాటు జిల్లా స్థాయిలో హైపవర్ కమిటీ, డీఈసీ పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించనున్నాయి. జిల్లా వ్యాప్తంగా దేవరాపల్లి, కేడీ పేట** ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఈ కేంద్రాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టి మాస్ కాపీయింగ్ నిరోధించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రశ్నపత్రాలు తెరవడం, జవాబు పత్రాలకు సీల్ వేయడం సీసీ కెమెరాల సమక్షంలోనే చేపట్టనున్నారు.

సెల్‌ఫోన్లు నిషేధం

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. సీఎస్‌లు, డిపార్టుమెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లు, పోలీసు, వైద్య సిబ్బంది, స్క్వాడ్ అధికారులు, ఇతర సిబ్బంది ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు. ఇతర ఎల్రక్టానిక్ పరికరాలు కూడా కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్షల విధులు నిర్వహించే సిబ్బంది అంతా తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలి. పరీక్షల సమాచారం అందించేందుకు కంట్రోలు రూంను ఏర్పాటు చేశారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి పరీక్ష కేంద్రాల ముఖ్యపర్యవేక్షకులు, డీవోలతో సమావేశం నిర్వహించి అన్ని జాగ్రత్తలు వివరించాం. విద్యార్థులు వీలైతే గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవడం మంచిది. నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించరు. హాల్‌టికెట్లను ఈసారి మరింత సులువుగా పొందేలా పబ్లిక్ డొమైన్‌లో ఉంచాం. మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి నిఘా ఉంచుతున్నాం. ఇందుకోసం అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు జిల్లా, రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయాలతో వాటిని అనుసంధానించాం. పరీక్ష విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా పని చేయాలి.

–బి.సుజాత, డీఐఈవో అనకాపల్లి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవలు మరింత విస్తృతం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ జిల్లా గవర్నర్ (3020) మళ్ల వెంకటేశ్వరరావు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో తల్లిపాల స్టోరేజీ కేంద్రాలు
- 10వేల మందికి ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ టీకాలు
- కంటి రోగులకు ఉచితంగా కళ్లద్దాల పంపిణీ
- రోటరీ జిల్లా గవర్నర్ వెంకటేశ్వరరావు వెల్లడి

అనకాపల్లి : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దశల వారీగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో బాలింతల తల్లిపాల స్టోరేజీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రోటరీ జిల్లా గవర్నర్(3020) మళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ప్రస్తుతం కాకినాడ, విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరలో కేజీహెచ్‌లో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. స్థానిక న్యూకాలనీ పాలూరి చిదంబరం రోటరీ ఫంక్షన్ హాల్లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తల్లిపాల స్టోరేజీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రూ.కోటి 25 లక్షలు ఖర్చు అవుతుందని, దీనికి రోటరీ క్లబ్ సభ్యులు ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు 2వేల అడుగుల స్థలం అవసరమన్నారు. అనకాపల్లి జిల్లా ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తే రూ.50 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. రోటరీ క్లబ్‌ను 1905లో ఏర్పాటు చేయగా ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీ నాటికి 120 ఏళ్ల పూర్తవుతుందని తెలిపారు. 220 దేశాల్లో పూర్తిగా పోలియో నిర్మూలనకు కృషి చేయడం జరిగిందని పేర్కొన్నారు. మన దేశంలో పూర్తిగా పోలియో నిర్మూలన జరిగిందని, పోలియో వ్యాధి రాకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా శాంతి స్థూపాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గర్భిణులకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి సోకకుండా 10వేల మందికి ఉచితంగా వ్యాక్సిన్లు అందజేయడం జరుగుతుందని, అలాగే కంటి చూపు మందగించిన రోగులకు రూ.35వేలు విలువ చేసే కంటి అద్దాలను అందజేయడం జరిగిందని తెలిపారు.

నేటి వరకూ క్లబ్ ఆధ్వర్యంలో 300 మందికి పంపిణీ చేసినట్టు చెప్పారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చిలో విద్యార్థులకు బెంచీలు అందజేస్తామని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుందని, ప్రస్తుతం ఎక్కడైనా డిజిటల్ తరగతుల బోర్డులు లేకపోతే తమ దృష్టికి తీసుకువస్తే ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకూ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వసతి గృహాలకు పరుపులు అందజేస్తామన్నారు. ప్రస్తుతం రూ.50లక్షల విలువ చేసే పరుపులు కొన్ని వసతి గృహాలకు అందించామని తెలిపారు. పలు ప్రాంతాల్లో శ్మశానాల్లో దహనవాటికలకు 19 మిషన్లు అందజేశామని తెలిపారు. ఒక్కో మిషన్ రూ.15 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎస్.రాజేష్‌కుమార్, కార్యదర్శి డి.అనిల్, కోశాధికారి జి.శతేంద్ర, అసిస్టెంట్ గవర్నర్ కె.మురళీకృష్ణ, క్లబ్ సభ్యులు బుద్ద రమణాజీ, కడిమిశెట్టి సతీష్, పి.జె.నాయుడు, కె.వి.గౌరీపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహించాలి

అనకాపల్లి టౌన్: ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రతి పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, భౌతిక జీవ శాస్త్ర ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్వహించాలన్నారు. అలాగే విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. ప్రతి విభాగంలో ప్రథమ బహుమతి అందించి వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయాలని తెలిపారు.

అన్నసమారాధన నిలిపేయడం దారుణం

డాబాగార్డెన్స్ : కల్యాణపులోవ తిరుణాళ్లలో వేలాది మంది భక్తులకు ఏటా నిర్వహించే మహా అన్న సమారాధనను ఎన్నికల కోడ్ పేరిట కూటమి ప్రభుత్వం నిలిపేయడం దారుణమని వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు రామన్నపాత్రుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అన్నసమారాధన నిర్వహించకపోవడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ముందుగా తెలిపితే సొంతంగా తనే అన్నదానం చేసేవాడినన్నారు. పదేళ్ల క్రితం సొంత నిధులతో కల్యాణపులోవ తిరునాళ్లకు విచ్చేసిన వేలాది మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని తానే ప్రారంభించానని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నెపంతో అన్నదాన కార్యక్రమం నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

చినదొడ్డిగల్లు తుప్పల్లో గర్భస్థ శిశువు



ఎస్సీ కాలనీ సమీపంలో గర్భస్థ శిశువు

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు ఎస్సీ కాలనీ సమీపంలో గురువారం ఉదయం ఐదు నెలల ఆడ గర్భస్థ శిశువు (పిండాన్ని) స్థానికులు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

అనకాపల్లి టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్. గణేష్ తెలిపారు. అనకాపల్లి మండలం కొత్తూరు సిరసపల్లి గ్రామం శివారులో దుర్గ అనే మహిళ 22 మద్యం సీసాలు కొని దొంగ చాటుగా అమ్మకాలు చేస్తుండగా ముందస్తు సమాచారం మేరకు దాడి చేసిచ అరెస్ట్ చేశామని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వింత ఆచారం.. వినూత్న వేడుక

భక్తి శ్రద్ధలతో రాజయ్యపేట నూకతాత పండగ
రోడ్డుపై పడుకుని మొక్కు చెల్లించుకున్న భక్తులు



మొక్కు చెల్లించుకునేందుకు రోడ్డుపై పడుకున్న గంగపుత్రులు

నక్కపల్లి: వింత ఆచారం, వినూత్న సంప్రదాయంతో చూడడానికి ఎంతో ఆసక్తి కలిగించడం అబ్బురపరిచే విధంగా ఉండే నూకతాత పండగను గురువారం మత్స్యకారులు అత్యంత ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జిల్లాలో కనీవినీ ఎరుగని వింత ఆచారంతో ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది మత్స్యకారులు అధికంగా ఉండే రాజయ్యపేటలో ఈ పండగను తరతరాలుగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా మహాశివరాత్రి మరుసటిరోజు రాజయ్యపేటలో నూకతాత పండగ జరుగుతుంది. నూకతాతను గంగపుత్రులు తమ కులదైవంగా, ఆరాధ్య దైవంగా భావిస్తారు. ఈ సందర్భంగా గురువారం నూకతాత విగ్రహాలను సముద్రస్నానానికి తీసుకెళ్లారు. తిరిగి ఆలయానికి విగ్రహాలను తీసుకొచ్చే సమయంలో భక్తులు రోడ్డుపై పడుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఇలా రోడ్డుపై పడుకున్న భక్తులపైనుంచి విగ్రహాలను చేతపట్టిన పూజారులు దాటుకుంటూ వెళ్లారు. ఇలా పడుకుని మొక్కులు చెల్లించుకోవడం



భక్తుల పైనుంచి దాటుకుంటూ వెళ్తున్న పూజారులు



నూకతాత విగ్రహాన్ని నెత్తిన పెట్టుకుని ఆశీస్సులు తీసుకుంటున్న హోంమంత్రి అనిత

ద్వారా తమ కోర్కెలు నెరవేరుతాయనేది మత్స్యకారుల నమ్మకం. గత ఏడాది కోరిన కోర్కెలు నెరవేరిన వారు ఈ ఏడాది కొత్తకోర్కెలు కోరుకునే వారు ఇలా రోడ్డుపై పడుకుని మొక్కు చెల్లించుకున్నారు. ఇలా మొక్కు చెల్లించుకుంటే నూకతాత అనుగ్రహం తమపై ఎల్లవేళలా ఉంటుందనేది గంగపుత్రుల నమ్మకం.

సందడిగా తిరునాళ్ల

సాధారణంగా గ్రామాల్లో నిర్వహించే పండగలు జాతరల్లో కోళ్లను మేకలను బలి ఇస్తారు. నూకతాత పండుగలో మాత్రం బలి నిషేధం. రక్తం చిందించడాన్ని నూకతాత ఒప్పుకోడని మత్స్యకారులు చెబుతారు. నూకతాత పండగను పురస్కరించుకుని గ్రామంలో పెద్ద తిరునాళ్ల జరిగింది. భారీ సెట్టింగులు ఏర్పాటు చేశారు. బాణాసంచాల సంబరాలు మిన్నంటాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ కుమార స్వామి, ఎస్ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు.

దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా నూకతాత పండక్కి రాజయ్యపేట చేరుకున్నారు. బంధువులు, స్నేహితుల రాకతో గంగపుత్రుల ఇళ్లన్నీ కళకళలాడాయి. నూకతాత ఆలయాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి దర్శించుకున్నారు.

వైభవంగా సాంబశివుని శూలాల మహోత్సవం



సాంబశివుని ఆలయంలో లింగోద్భవంలో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

కశింకోట : కశింకోటలో బుధవారం రాత్రి పొద్దుపోయాక సాంబశివుని శూలాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మహా శివరాత్రి పురస్కరించుకొని స్థానిక కుమ్మరి వీధిలో వెలసి ఉన్న సాంబశివుని ఆలయం నుంచి ఉమా, సాంబశివుని ఉత్సవ విగ్రహాలను రిక్షాలో ఊరేగించారు. భక్తులు సాంబశివుని శూలాలు, గంప శూలాలు, సుబ్రహ్మణ్య శూలాలు ధరించి సంప్రదాయ డప్పులు, వాయిద్యాలతో ఉత్సవ ఊరేగింపు ప్రారంభమైంది. కస్పావీధి, పెద్ద బజారు, శివాలయం వీధి, ఉప్పునీటి దిబ్బ, ద్వారపురెడ్డి వీధి, సతకంపట్టు, పందిరి వీధులు మీదుగా తిరిగి ఆలయం వరకూ ఊరేగింపు సాగింది. దారి పొడవునా ప్రజలు శూల ధారులకు భక్తి శ్రద్ధలతో నీరాజనాలు పలికారు. ఉత్సవాన్ని ఆసక్తిగా తిలకించారు. ఉత్సవ మూర్తులను దర్శించారు. ఆలయంలో లింగోద్భవం పురస్కరించుకొని భక్తులు పంచామృతాలతో స్వయంగా అభిషేకించారు. ఆలయం వద్ద తోడపెద్దు సేవ, తప్పెటగుళ్ల తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

యువకుడ్ని రక్షించిన మెరైన్ సిబ్బంది



సముద్రంలో మునిగిపోతున్న గింజాల రాజును రక్షించిన మెరైన్ సిబ్బంది

పాయకరావుపేట : పెంటకోట సముద్ర తీరంలో అమావాస్య సందర్భంగా స్నానం చేస్తున్న యువకుడు సముద్రంలో మునిగిపోవడంతో మెరైన్ సిబ్బంది రక్షించినట్టు మెరైన్ హెచ్సీ వర్మ తెలిపారు. సముద్ర స్నానం చేస్తుండగా కెరటాలకు డీఎల్ పురం గ్రామానికి చెందిన గింజాల రాజు మునిగిపోతున్నాడు. దీంతో మెరైన్ పోలీసు సిబ్బంది పి.అప్పలరాజు, ఓ.శివ అతనిని కాపాడారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 8 మందికి జైలు

- 23 మందికి జరిమానా

యలమంచిలి రూరల్ : యలమంచిలి ట్రాఫిక్, రూరల్ పోలీసులు నమోదు చేసిన డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో నిందితులను గురువారం యలమంచిలి కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా 23 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.2,30,000 జరిమానా విధించారు. మరో 8 మందికి ఒక్కొక్కరికి నాలుగు రోజుల చొప్పున జైలుశిక్ష విధించినట్టు పోలీసులు విలేకరులకు తెలిపారు.

శివరాత్రి ఆదాయం రూ.కోటి

300 ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీ

డాబాగార్డెన్స్/కూర్మన్నపాలెం: మహా శివరాత్రిని పురస్కరించుకుని వివిధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా ఆర్టీసీకి రూ.కోటి వరకు ఆదాయం సమకూరిందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని శివాలయాలకు సర్వీసులు నడిపినట్లు చెప్పారు. కూర్మన్నపాలెం జంక్షన్లో గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. అంతకుముందు గాజువాక డిపో నుంచి అప్పికొండ, ఆర్కే బీచ్కు ప్రత్యేక బస్సులు ప్రారంభించారు. శివరాత్రి జాగరణ అనంతరం సముద్ర స్నానాలు ఆచరించే భక్తుల కోసం 26వ తేదీ అర్ధరాత్రి నుంచి 27 సాయంత్రం వరకు నగరంలోని అన్ని డిపోల నుంచి బస్సులు నడిపినట్లు చెప్పారు. గాజువాక, కూర్మన్నపాలెం, అగనంపూడి ప్రాంతాల నుంచి అప్పికొండకు, అలాగే తగరపువలస, భీమిలి, ఆరిలోవ కాలనీ, రవీంద్రనగర్, పెందుర్తి, కొత్తవలస, సింహాచలం, గాజువాక, కూర్మన్నపాలెం తదితర ప్రాంతాల నుంచి ఆర్కే బీచ్కు సూపర్వైజర్లు, సిబ్బంది పర్యవేక్షణలో సుమారు 300 ప్రత్యేక బస్సులను నడిపినట్టు అప్పలనాయుడు వివరించారు. భక్తుల సౌకర్యార్థం ముఖ్య కూడళ్ల వద్ద టెంట్లు వేసి.. ఒక్కో చోట నలుగురు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. మంచి నీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. ఒక్క అప్పికొండ తీర్థయాత్ర వల్ల ఆర్టీసీకి రూ.30 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు చెప్పారు. గతేడాది కంటే ఈ ఏడాది రెట్టింపు ఆదాయం లభించినట్లు వెల్లడించారు. పుణ్యగిరి, నర్సీపట్నం, కల్యాణపులోవ తదితర పుణ్యక్షేత్రాలకు కూడా నగరంలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు పంపించామన్నారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణ, సింహాచలం డిపో మేనేజర్ కె.రాజశేఖర్, వాల్తేర్ డిపో మేనేజర్ కె.సుధాకర్, స్టీల్ సిటీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, గాజువాక డిపో మేనేజర్ వి.ప్రవీణ, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

పోసాని అరెస్ట్ను తీవ్రంగా ఖండిస్తున్నాం

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్వెస్లీ

సాక్షి, విశాఖపట్నం: సినీ నటుడు, ఏపీఎఫ్డీసీ మాజీ అధ్యక్షుడు పోసాని కృష్ణమురళి అరెస్ట్ను త్రీవంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్వెస్లీ అన్నారు. అక్కయ్యపాలెంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ అరాచకాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయని అన్నారు. పోసాని కృష్ణమురళికి ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పోలీసులు అనుసరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా.. కేవలం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యాకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

దానాపూర్-చర్లపల్లి మధ్య వన్ వే స్పెషల్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దానాపూర్-చర్లపల్లి స్టేషన్ల మధ్య వన్ వే స్పెషల్ నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. దానాపూర్-చర్లపల్లి(03299) వన్ వే స్పెషల్ శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు దానాపూర్లో బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 6.25 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు విజయనగరం, కొత్తవలస స్టేషన్లలో ఆగుతుంది.



గుళ్ల ఆట ఆడిస్తున్న ఒకరి అరెస్టు

అనకాపల్లి: కేఎస్ఆర్పేటలో గుళ్ల ఆట ఆడిస్తున్న అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.1650 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలికను రక్షించిన లైఫ్గార్డులు

ఆరిలోవ: మహా శివరాత్రి పుణ్యస్నానాల కోసం గురువారం జోడుగుళ్లపాలెం బీచ్కు వచ్చిన ఓ బాలిక కెరటాల్లో చిక్కుకుంది. జీవీఎంసీ లైఫ్గార్డులు వెంటనే స్పందించి ఆమెను ప్రాణాలతో రక్షించారు. వివరాలివీ.. ద్వారకానగర్ ప్రాంతం నుంచి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు జోడుగుళ్లపాలెం బీచ్కు గురువారం మధ్యాహ్న సమయంలో సముద్ర స్నానాలకు వెళ్లారు. అక్కడ స్నానాలు చేస్తుండగా.. అతని కుమార్తె కెరటాలలో చిక్కుకుని లోపలకు వెళ్లిపోయింది. ఇది గమనించిన సుబ్రహ్మణ్యం, అతని కుటుంబ సభ్యులు బాలికను రక్షించడానికి లోపలకు వెళ్లగా.. వారు కూడా కెరటాల మధ్యలో చిక్కుకున్నారు. దీంతో వారంతా పెద్ద కేకలు పెట్టడంతో అక్కడే ఉన్న జీవీఎంసీ లైఫ్గార్డులు రమేష్, రాజు, లక్ష్మణ్, సాయి వెంటనే స్పందించి ఆ బాలికతో పాటు కుటుంబ సభ్యులను రక్షించి ఒడ్డుకు చేర్చారు. విషయం తెలుసుకున్న ఆరిలోవ ఎస్ఐ కృష్ణ, కానిస్టేబుళ్లు అక్కడకు చేరుకుని వారికి వైద్య పరీక్షలు చేయించారు. ప్రాణాలతో బయటపడిన సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు లైఫ్గార్డులు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



లైఫ్గార్డులు రక్షించిన బాలిక, కుటుంబ సభ్యులు

గంజాయి ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష

గొలుగొండ: గంజాయి కేసులో నేరం రుజువు కావడంతో కోర్టు పదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధించినట్లు నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన గొలుగొండలో విలేకరులతో మాట్లాడుతూ గొలుగొండ మండలం పోలవరం గ్రామానికి చెందిన గజ్జి సత్తిబాబు 2014లో 183 కేజీల గంజాయితో పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. అప్పటి ఎస్ఐ జోగారావుకు వచ్చిన సమాచారంతో దాడి చేసి పట్టుకుని సత్తిబాబును కోర్టుకు తరలించారన్నారు. గురువారం విశాఖపట్నం ఎంఎస్జే కోర్టులో పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించంతో నేరం రుజువై శిక్ష, జరిమానా విధించినట్లు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

అప్పటి ఎస్ఐ జోగారావు కేసు దర్యాప్తులో చురుగ్గా పని చేయడంతో ఆయనను అభినందించారు. కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు జనవరి జీతం చెల్లింపు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగులకు జనవరి నెల జీతాన్ని శాతాలవారీగా గురువారం చెల్లించింది. ఎస్-1 నుంచి ఎస్-6 గ్రేడ్ కార్మికులకు పూర్తి(100 శాతం) జీతం చెల్లించగా, ఎస్-7, ఆ పైగ్రేడ్ కార్మికులు, అధికారులకు 75 శాతం చెల్లించారు. ఇప్పటి వరకు అందరు ఉద్యోగులకు 255 శాతం జీతం పెండింగ్లో ఉండేది. ఈ చెల్లింపులు ద్వారా ఎస్-6 వరకు ఉన్న కార్మికులకు 155 శాతం, ఎస్-7, ఆ పైగ్రేడ్ కార్మికులు, అధికారులకు 180 శాతం జీతం బకాయి ఉంది. ఎన్నడూ లేని విధంగా ఈసారి కార్మికులను రెండు గ్రూపులుగా విడదీసి, జీతం చెల్లించడం పట్ల కార్మిక వర్గాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొంత మంది ఓటు రాజకీయాలు చేసే కార్మిక నాయకులు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి, రెండు గ్రూపులుగా విడదీశారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి నక్క జిత్తులకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని కార్మికులు వ్యాఖ్యానిస్తున్నారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

యలమంచిలి రూరల్: యలమంచిలి రూరల్ పీఎస్ పరిధి కొక్కిరాపల్లి అగ్రహారం శివారులో డబ్బు పందెంగా పెట్టి పేకాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర తెలిపారు. వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.27,770 నగదు స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశామన్నారు.

2న జూలో పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో మార్చి 2న విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు వన్య ప్రాణుల సంరక్షణ గురించి తెలపాల్సి ఉంటుందన్నారు.

డీపీఎస్లో ఎమ్మెల్సీ ఓటరు నమోదు వివాదం

ఉక్కునగరం: స్టీల్ప్లాంట్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అంశంలో వివాదం ఏర్పడింది. ఆ పాఠశాలలో ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ ఓటరు నమోదుకు అవకాశం కల్పించలేదని ఆరోపణలు తలెత్తగా.. ప్రిన్సిపాల్ ఆ ఆరోపణలను తిరస్కరించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పోలింగ్ నేపథ్యంలో గురువారం గాజువాకకు చెందిన ఆర్టీఐ ఫోరం కన్వీనర్ కృష్ణకుమార్కు డీపీఎస్కు చెందిన కొంతమంది ఫోన్ చేశారు. 60 మంది ఉపాధ్యాయులకు ఓట్లు లేవని, ప్రిన్సిపాల్ వల్లే వారు ఓటు హక్కు కోల్పోయారని ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే ఏఆర్వో, డీఆర్వో భవానీ ప్రసాద్, డీఈవో ప్రేమ్కుమార్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. దీనిపై డీఈవో స్పందించి, గాజువాక ఎంఈవోను విచారణకు ఆదేశించారు. ఆయన పాఠశాలకు చేరుకుని విచారించారు. గత ఎన్నికల వలె ఎమ్మెల్సీ అభ్యర్థులు ఓటరు నమోదు చేయిస్తారనే ఉద్దేశంతో.. తాము ఓటరు నమోదు చేయించుకోలేదని అక్కడి ఉపాధ్యాయులు తెలిపినట్లు ఎంఈవో వెల్లడించారు. దీనిపై ప్రిన్సిపల్తో మాట్లాడగా, వచ్చిన ఓటరు నమోదు దరఖాస్తులు అర్హులైన ఉపాధ్యాయులకు అందజేశామన్నారు. తాము ఎవరినీ అడ్డుకోలేదని చెప్పారు. కృష్ణకుమార్ మాట్లాడుతూ ఓటరు నమోదును అడ్డుకున్న ప్రిన్సిపాల్పై జేసీకి ఫిర్యాదు చేశానని, విచారించి చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారని వెల్లడించారు.





పెద్దలతో పాటు ఉత్సాహంగా స్నానం చేస్తున్న చిన్నారులు..




అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో బారులుతీరిన భక్తులు

భక్త జనసాగరం

తీరానికి పోటెత్తిన భక్తులు • పుణ్యస్నానాలు ఆచరించిన జనం • మార్మోగిన శివనామస్మరణ

ఏయూక్యాంపస్/పెదగంట్యాడ/ఆరిలోవ: సాగర తీరం శివనామస్మరణతో పులకించింది. శంభో శంకర.. హర హర మహాదేవ నినాదం సాగర ఘోషను మించిపోయింది. భక్తులు శివరాత్రి జాగరణ పూర్తి చేసి ఉదయం పుణ్యస్నానాలు ఆచరించారు. బుధవారం ఉదయం నుంచి శివాలయాల్లో అభిషేకాలు జరిపి, రాత్రి లింగోద్భవ సమయం వరకు శివనామ స్మరణతో గడిపారు. అనంతరం గురువారం తెల్లవారుజాము నుంచి సముద్ర స్నానాలకు నగరం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేశారు. దీంతో అప్పికొండ, జోడుగుళ్లపాలెం, రామకృష్ణ బీచ్, పాండురంగాపురం, వైఎంసీఏ, వీఎంఆర్డీఏ పార్క్, అప్పుఘర్, తెన్నేటిపార్క్, సాగర్ నగర్, రుషికొండ తదితర బీచ్లు కిటకిటలాడాయి. సముద్ర స్నానాలు ఆచరిస్తూ ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడికి, పరమేశ్వరుడికి ప్రణతులు అర్పించారు. మహిళలు తీరంలో సైకత లింగాన్ని తయారు చేసి పూజలు జరిపారు. అనంతరం సమీపంలోని శివాలయాలను దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో పోలీసులు పటిష్ఠ భద్రత చేపట్టారు. అడుగడుగునా మైకుల్లో హెచ్చరిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ఉదయం ఆర్.కె. బీచ్ నుంచి వైఎంసీఏ వరకు వాహనాలను అనుమతించలేదు. అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేలాది మంది ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించారు. 100 మంది గజ ఈతగాళ్లతో ఇక్కడ భద్రత ఏర్పాట్లు చేశారు.



క్లుప్తంగా

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలాం సేవా సంఘం సభ్యులు

అనకాపల్లి టౌన్: స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద చంద్రశేఖర్ ఆజాద్ 94 వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బ్రిటీషర్ల చేతిలో చావడం కంటే ఆత్మహత్యే మేలని దేశం కోసం ప్రాణాలొదిన మహావీరుడని, దేశానికి ఆజాద్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, నటభూషణ్ శోభన్‌బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు, ఆమ్ ఆద్మీ పార్టీ పట్టణ కన్వీనర్ కొణతాల హరనాథ్, దిలీప్, ఆజాద్, నర్సింగరావు, సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద అన్నసమారాధన



అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కోరుకొండ జగదీష్

అనకాపల్లి: స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద 31వ ఆరాధన మహోత్సవాలు పురస్కరించుకుని గురువారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ సీనియర్ నాయకుడు కోరుకొండ జగదీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి తుంపాల సతీష్, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, వీరబ్రహేంద్రస్వామి గోవింద మాంబ కల్యాణం కమిటీ సభ్యులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెరిగిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర పెరిగింది. కిలోకు రూ.5 నుంచి రూ.10 అదనంగా పెరిగింది. గత వారం కిలో రూ.10 ఉండగా, ఈ వారం అది రూ.20 వరకు పెరిగింది. బంగాళదుంప, వంకాయ రూ.30, ఉల్లి, బెండకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, చామదుంప, బీన్స్, చిక్కుడు రూ.60, బీర కాయ రూ.80కి అమ్మకాలు సాగాయి.

బెల్ట్ దుకాణంపై దాడి

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గవర జగ్గయ్యపాలెంలో ఓ బెల్ట్ దుకాణంపై పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న కళ్లేపల్లి కాసుబాబును అదుపులోకి తీసుకుని, అతడి వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న 18 క్వార్టర్ బాటిళ్లను మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్	: రాజా
జాబిలమ్మ నీకు అంత కోపమా :	సత్యనారాయణ స్క్రీన్-1(ఉదయం,మ్యాట్నీ)
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1 (1,2 షోలు)
అగాథియా	: సత్యనారాయణ స్క్రీన్-2
మజాకా	: పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
గార్డ్	: వెంకటేశ్వర(ఉదయం)
తండేల్	: శ్రీసత్య
శుబ్బం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు , బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 365 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 298 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

మృత్యుహేల

- ప్రమాదాలకు నిలయంగా అనకాపల్లి రైల్వే ట్రాక్‌లు
- దగ్గర దారి కావడంతో వీటిపై ప్రయాణం
- అండర్ బ్రిడ్జి, కాలిబాట వంతెన లేక ప్రమాదాలు
- ఏడాదికి 40 నుంచి 50 మంది వరకూ మృత్యువాత



లక్ష్మీదేవిపేట వద్ద రైల్వేస్టేషన్ ట్రాక్‌లు

అనకాపల్లి: అధునాతన రైళ్లతో పరుగులు పెట్టిస్తున్న రైల్వే శాఖ ఇప్పటికీ పలు చోట్ల ట్రాక్‌లపై కాలిబాట వంతెనలు, అండర్ బ్రిడ్జిలు లేక మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. అనకాపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో పలు చోట్ల రైల్వే ట్రాక్‌లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. పట్టణంలోని శారదానది బ్రిడ్జి నుంచి జీవీఎంసీ విలీన గ్రామమైన తాడి రైల్వే స్టేషన్ వరకూ ఇదే పరిస్థితి నెలకొంది. ఏటా రైల్వే ట్రాక్‌లపై రాకపోకలు సాగిస్తున్న వారిలో 40 నుంచి 50 మంది వరకూ వివిధ రూపాల్లో మృతి చెందుతున్నారు. అయినా ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు, ఇతర శాఖ అధికారులకు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. శారదానది బ్రిడ్జి రైల్వే ట్రాక్‌కు అతిసమీపంలో చవితినివీధి, విజయరామరాజుపేట, ఏఎంసీ కాలనీ, లక్ష్మీదేవిపేట, నాయుళ్లవీధి, భీమునిగుమ్మం, జీవీఎంసీ విలీన గ్రామమైన వల్లూరు, రాజుపాలెం ఉన్నాయి. అనకాపల్లి పట్టణంలో భీమునిగుమ్మం వద్ద బ్రిటీష్ కాలంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రైల్వే స్టేషన్ దశలు వారిగా అభివృద్ధి చెందుతూ వస్తోంది. అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అనకాపల్లి నుంచి విశాఖకు రోజు 30 వేల మంది రాకపోకలు సాగిస్తారు. వీరు ఎక్కువగా మంత్లీ సీజన్ టిక్కెట్లు తీసుకుంటారు. దక్షిణ మధ్య రైల్వేలో చిట్ట చివరి స్టేషన్ ఇదే.. ఇక్కడ నుంచి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు.



శారదానది రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని మృతదేహం(ఫైల్)

శారదానది బ్రిడ్జి రైల్వే ట్రాక్‌లపై ఎక్కువగా మృతి...

అనకాపల్లి మండలం మూలపేట గ్రామం నుంచి శారదానది బ్రిడ్జి రైల్వే ట్రాక్‌లపై వచ్చేందుకు చాలా దగ్గర మార్గం కావడంతో కాలినడకన రైతులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అనకాపల్లి పట్టణానికి రైల్వే ట్రాక్‌లపై సుమారుగా కిలోమీటరు దూరం మాత్రమే ఉంది. అదే రోడ్డు మార్గంలో రావాలంటే మూడు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దాంతో మూలపేట నుంచి శారదానది బ్రిడ్జి ట్రాక్‌లపై నుంచి వెళ్లే వ్యక్తి తప్పించుకుని అవకాశం లేక మృత్యువాత పడుతున్నారు.

రైలు పట్టాలు దాటుతూ మృత్యువాత

పట్టణ పరిధిలో విజయరామరాజుపేట, లక్ష్మీదేవిపేట, చవితిని వీధి, భీమునిగుమ్మం, రింగ్‌రోడ్డు, జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరు, వల్లూరు, రాజుపాలెం గ్రామాల రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో రైలు పట్టాలు దాటుతుంటారు. ఆ సమయంలో రైళ్లు ఢీకొని మృతి చెందుతున్నారు. దీనికితోడు ఈ మార్గంలో కొన్ని సూపర్ ఫాస్ట్ రైళ్ల ఫుట్‌పాత్‌లపై కూర్చొని ప్రయాణించే ప్రయాణికులు జారిపడి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి.



అనకాపల్లి స్టేషన్ సమీపంలో పట్టాలపై మహిళా మృతదేహం(ఫైల్)

కాలిబాట వంతెన ఏర్పాటుతో ప్రమాదాల నియంత్రణ

పట్టణంలో గాంధీనగరం, మిరియాల కాలనీ, విజయరామరాజుపేట, శ్రీరామ్‌నగర్, అంజయ్యకాలనీ, మండలంలో తుమ్మపాల పంచాయతీ ప్రజలు అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు ఏఎంసీ కాలనీ ద్వారా లక్ష్మీదేవిపేటకు రైల్వే ట్రాక్‌లపై నుంచి ప్రయాణించడం వల్ల కొన్ని సందర్భాల్లో రైళ్లు ఢీకొని మృతి చెందుతున్నారు. ఏఎంసీ కాలనీ నుంచి లక్ష్మీదేవిపేట రైల్వే గేటుకు కాలిబాట వంతెన వేసినట్లయితే వారి ప్రాణాలను కాపాడవచ్చు.

అధికారుల తీరు సరికాదు



రైల్వే నిబంధనలు ప్రకారం ట్రాక్‌లపై నడిచి వెళ్లడం మంచిది కాదు. అయినప్పటికీ మండలంలో మూలపేట గ్రామం నుంచి శారదానది రైల్వే బ్రిడ్జిపై నుంచి రైతులు, ఇతర వర్గాల ప్రజలు దగ్గర మార్గం కావడంతో రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై రైల్వే అధికారులు దృష్టి సారించాలి.

– కె.ఎం.నాయుడు, గవరపాలెం, అనకాపల్లి

కాలిబాట వంతెన వేయాలి

పట్టణంలో ఏఎంసీ కాలనీ నుంచి లక్ష్మీదేవిపేటకు వెళ్లే మార్గంలో కాలువపై చిన్నపాటి కాలిబాట వంతెన నిర్మించినట్లయితే స్టేషన్‌కు దగ్గరగా చేరుకోవచ్చు. ఈ విషయాన్ని రైల్వే శాఖకు, జీవీఎంసీ అధికారులకు అనేకసార్లు స్థానికులు ఫిర్యాదులు చేశారు. సమస్య చిన్నదైనప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో కంటే జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత మరిన్ని రైళ్లకు అనకాపల్లి రైల్వే స్టేషన్లో హాల్ట్‌లు కల్పించారు. ఇప్పటికైనా కాలిబాట వంతెనపై దృష్టి సారించాలి.

–కె.హరనాథ్‌బాబు, లక్ష్మీదేవిపేట, అనకాపల్లి

అధిక లోడు లారీల పట్టివేత



పట్టుబడిన బెంజ్ లారీలు

అనకాపల్లి: మండలంలో మార్టూరు గ్రామం నుంచి రాంబిల్లికి అధిక లోడుతో కొండరాయిని తరలిస్తున్న రెండు బెంజ్ లారీలను బొజ్జన్న కొండ రహదారిలో పట్టుకున్నామని రూరల్ ఎస్‌ఐ రవికుమార్ గురువారం తెలిపారు. రెండు లారీలను ఆర్టీవోకు అప్పగించగా, ఒక లారీకి రూ.64 వేలు, మరో లారీకి రూ.74 వేల అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి టౌన్: పట్టణ పరిధిలో 33 కేవీ విద్యుత్‌లైన్‌లో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. రింగ్ రోడ్, నాయుళ్లవీధి, మళ్లవీధి, కోట్నివీధి, చిన్నవీధి, గాంధీ బొమ్మ సెంటర్, పూడిమడక రోడ్, రావుగోపాలరావు కళాకేంద్రం, సత్యా థియేటర్ రోడ్, గూడ్స్ రోడ్, పిల్లా వారి వీధి ప్రాంతాల్లో అసౌకర్యం ఉంటుందన్నారు.

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. నిర్దేశిత సమయంలో సబ్ స్టేషన్ పరిధిలోని నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, ఏనుగుతుని, చిన్న ఏనుగుతుని, గొల్లగుంట, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

ఘనంగా ముగిసిన శివరాత్రి వేడుకలు



వేల్పులవీధి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీకాళహస్తి దేవాలయంలో శివుని సెట్

అనకాపల్లి టౌన్: పట్టణంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. భక్తులు బుధవారం అర్ధరాత్రి వరకు వివిధ దేవాలయాల్లో శివనామ సంకీర్తనతోనూ జపధ్యానాలతోనూ కాలక్షేపం చేశారు. ఈ సందర్భంగా సిద్ధిలింగేశ్వర స్వామి ఆలయంలో హోమ పూజలు, భక్తి గీతాలాపన కార్యక్రమాలు జరిగాయి. గర్భగుడిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్ భక్తులను ఆకట్టుకుంది. రాత్రి ఆలయ ఆవరణలో భారీ ఎత్తున ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుని ఆలయం వద్ద నక్కా శంకర్ ఆధ్వర్యంలో శిల్పి కామధేనువు జగదీష్ తయారు చేసిన శ్రీకాళహస్తిలో శివుని సెట్ విశేషంగా ఆకట్టుకుంది. భోగలింగేశ్వరుడు, కాశీవిశ్వేశ్వరుడు, ఉమా రామలింగేశ్వరుడు, సాధువుల గుడి తదితర శివాలయాలలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

త్రిపురాంతకస్వామికి అలంకరణ...

కశింకోట: స్థానిక పురాతన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో స్వామి అలంకారం భక్తులను కనువిందు చేసింది. బుధవారం అర్ధరాత్రి మహా శివరాత్రి లింగోద్భవ పూజలు అనంతరం శివ లింగాన్ని నూతన వస్త్రాలు అలంకరించి అందంగా తెల్ల జిల్లేడు పూలమాలలు, మారెడు పత్రాలు, పూలతో చూడముచ్చటగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. దివ్య మంగళ రూపాన్ని వందల సంఖ్యలో భక్తులు బారుల తీరి భక్తి పారవశ్యంతో తరించి తన్మయత్వం చెందారు. లింగోద్భవ పూజలు యావత్తు ఆలయం బయట ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఇది ఆహూతులను మంత్ర ముగ్ధులను చేసింది. అనంతరం ప్రసాద వితరణ చేశారు. అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



సిద్ధిలింగేశ్వరుడు ఆలయంలో హోమం పూజలు



సిద్ధిలింగేశ్వరుని ఆలయం గర్భగుడిలో శివపార్వతులతో ప్రత్యేక అలంకరణ



కశింకోట శివాలయంలో శివలింగం



కశింకోట శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

వృథాగా పోతున్న మంచినీరు

తుమ్మపాల: వేసవికాలం మొదలు కావడంతో గ్రామాల్లో నీటి కొరత తీవ్రతరమవుతోంది. నీటి కొరతతో మంచినీటి కుళాయిల వద్ద పలు గ్రామాల్లో మహిళలు జడలు పట్టుకుని కొట్లాడుకుంటున్నారు. ప్రతి ఇంటికి కుళాయి తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన జలజీవన్ మిషన్ పథకాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యంతో ఈ ఏడాది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే మండలంలో కోడూరు పంచాయతీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో గొల్లపేట వద్ద మంచినీటి ట్యాంక్ నిండిపోయి గంటల పాటు వృథాగా పారుతున్నా పట్టించుకునే నాథుడే కనబడలేదు. శివారు గ్రామం గొల్లపేటలో మంచినీటి కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ ట్యాంక్ నుంచి మంచినీరు పారుతుండటంతో గ్రామస్తులు పాలకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ట్యాంక్ వద్ద నీరు పారి రోడ్డంతా బురదగా మారుతోంది. మురుగు కాలువ మంచినీటితో నిండి అధ్వానంగా మారింది. గ్రామీణ మంచినీటి శాఖ, సచివాలయ అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పంచాయతీ ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న మంచినీరు

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నిక

582 మంది ఉపాధ్యాయులకుగాను 555 మంది ఓటు



ఓటింగ్‌కు ఉత్సాహంగా వచ్చిన మహిళా ఓటర్లు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో ఉడ్‌పేట ఎలిమెంటరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మొత్తం 582 మంది ఉపాధ్యాయులకుగాను 555 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద దివ్యాంగు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీల్‌చైర్లు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. పోలింగ్ కేంద్ర వద్ద ఎటువంటి ఇబ్బందులు తలపెట్టకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టణ సీఐ టి.వి.విజయ కుమార్ ఆధ్వర్యంలో గట్టిపోలీస్ బందోబస్తు నిర్వహించారు.

కశింకోటలో 83 మంది ఓటుహక్కు వినియోగం..

కశింకోట: స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో మొత్తం 83 ఓట్లు పోలయ్యాయి. 47 మంది పురుష ఓటర్లు, 36 మంది మహిళా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మందకొడిగా సాగి మధ్యాహ్నం 2 గంటలకు 82 ఓట్లు పోలయ్యాయి. అప్పటి నుంచి దాదాపు గంటన్నర తర్వాత చివరి ఓటు పోలైంది. విశాఖ నుంచి వచ్చిన ఓటరు ఓటు వేశారు. దీంతో పోలింగ్ పూర్తి అయింది. మండల గ్రామాలు, ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లుగా నమోదైన ఉపాధ్యాయులు ఉత్సాహంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బ్యాలెట్ విధానంలో జరిగిన ఓటింగ్‌లో అభ్యర్థులకు అంకెలతో ప్రాధాన్యత క్రమంలో ఓట్లు వేశారు. ఓటింగ్ సమయం ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్‌ను పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో సీలు వేసి ప్యాక్ చేసి బస్సులో అనకాపల్లి కలెక్టరేట్‌కు తరలించారు. పోలింగ్ కేంద్రాన్ని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి పోలింగ్ ప్రశాంతంగా పూర్తి కావడానికి సూచనలిచ్చారు. తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు పోలింగ్ తీరును పరిశీలించారు. పోలింగ్ కేంద్రం బయట ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు కావలసిన వారికి ఈ సందర్భంగా సిబ్బంది పంపిణీ చేశారు. ఎండ తగలకుండా పోలింగ్ కేంద్రం ముందు షామియానా ఏర్పాటు చేసి రెవెన్యూ సిబ్బంది ఓటర్లకు సహకారం అందించారు. పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



కశింకోటలోని బాలికల పాఠశాలలో పోలింగ్



ఓట్లు వేయడానికి ఓటర్ల నిరీక్షణ



ఆరోగ్య శిబిరం నిర్వహణ



కశింకోట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి



ఓటు హక్కును వినియోగించుకుని వస్తున్న ఉపాధ్యాయులు



చివరగా ఓటు వేసిన ఓటరు



దివ్యాంగు ఉపాధ్యాయినిని ఓటు కోసం తీసుకెళ్తున్న కుటుంబ సభ్యుడు

పుణ్య స్నానాలకు పోటెత్తిన భక్త జనం



తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్త జనం

పరవాడ: మహాశివరాత్రి ఉపవాసం, జాగరణ దీక్షల అనంతరం సముద్ర స్నానాలకు వచ్చే భక్తులతో ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు పోటెత్తాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాల నలుమూలల నుంచి అశేష జన సందోహం తరలివచ్చింది. గురువారం తెల్లవారు జాము నుంచి తీరాలకు చేరుకుని, పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలోని మహాశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొండి అచ్చిబాబు ఆధ్వర్యంలో భక్తులకు సదుపాయాలు కల్పించారు. బుధవారం రాత్రి తీరంలో భక్తుల సౌకర్యార్థం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పరవాడ అడిషినల్ ఎస్పీ దేవప్రసాద్ ఆధ్వర్యంలో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు పర్యవేక్షణలో తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.